

పొగాకు సాగు

- నష్టాలతో తగ్గిన మిరప..
- శనగ వెలవెల.. మెరిసిన మొక్కజొన్న
- మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు



సాగు.. తారుమారు

అతివృష్టి.. అనావృష్టి.. తెగుళ్లు.. దిగుబడులు తగ్గడం.. ధరలు లేకపోవడం.. నష్టాలు.. కష్టాలతో.. సాగు చిత్రం ఏటికేడు మారిపోతోంది. పంటల సాగు తారుమారవుతోంది. నష్టాలు.. ధరలను బట్టి రైతులు సాగు చేసే పంటలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వస్తున్నారు. ఏటేటా పంటల సాగు మారుస్తున్నా ఏమాత్రం కలసి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో వాణిజ్య పంటలు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని డెల్టాలో వరి ఎక్కువగా సాగవుతుంటోంది. అయితే ఈ సారి వర్షాలు చాలావరకు పంటలను దెబ్బతీశాయి. దీంతో రైతులు సాగు చేసే పంటలను ఏటికేడు మారుస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది కన్నా ఈ ఏడు మిరప సాగు 55,804 ఎకరాల్లో తగ్గింది. మిరపకు ప్రత్యామ్నాయంగా పొగాకు.. మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపారు. గత ఏడాది ఆశాజనకంగా లేక పోవడంతో ఈ ఏడాది శనగ సాగును వేలాది మంది రైతులు వీడారు. మొత్తంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో పంటల సాగులో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఏటికేడు సాగు చిత్రం మారిపోతున్నది. తెగుళ్లు.. గిట్టుబాటు ధర లేకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో రైతులు ఈ ఏడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు పండించినా మిగులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు విసిగి వేసారిపోతున్నారు. తక్కువ పెట్టుబడులు.. ఎక్కువ దిగుబడులతో.. కొంతైనా లాభాలతో బయటపడే అవకాశం ఉన్న పంటల సాగుకు ఎక్కువ మంది రైతులు ఆశక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, పొగాకు సాగు గణనీయంగా పెరగ్గా మిరప, శనగ సాగు అదే స్థాయిలో పతనమైంది. గత ఏడాదికి కన్నా మిరప, శనగ సాగు 1,15,503 ఎకరాల్లో తగ్గింది. మొక్కజొన్న, పొగాకు సాగు గత ఏడాది కన్నా 99,550 ఎకరాల్లో పెరగడం గమనార్హం.



శనగ

పంటల సాగు ఇలా(ఎకరాల్లో)..

పంటలు	గత ఏడాది	ఈ ఏడాది
మిరప	1,71,226	1,15,422
పొగాకు	44,035	91,585
శనగ	1,38,052	78,352
మొక్కజొన్న	52,000	1,09,247



మొక్కజొన్న

ధర పతనంతో తీవ్రంగా నష్టం

గత ఏడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైతులు విస్తృతంగా మిరప సాగు చేశారు. వర్షాభావం.. తెగుళ్ల మిరప దిగుబడులపై (మిగతా 8వ పేజీలో)

మంగళగిరి చేనేతకు జీవం

- 10.80 ఎకరాల్లో మెగా చేనేత పార్కు



చేనేత పార్కుస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత (ఫైల్)



చేనేతకు మంత్రి నారా లోకేశ్ పునరుజ్జీవం

- నేతన్నల రెండున్నర దశాబ్దాల కల సాకారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి
- కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశాలు

మంగళగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చేనేత ఖిల్లా మంగళగిరిలో చేనేతకు జీవం పోసేందుకు మంత్రి నారా లోకేశ్ తీసుకున్న సంకల్పం నెరవేరింది. ఒకప్పుడు చేనేత మగ్గాల సవ్వడులతో.. తెల్లవారుతూనే పరిచినట్టు కనిపించే మొలకట్టుడు అల్లికలతో.. సంప్రదాయ కళతో కనువిందు చేసే వీధులతో దర్శనమిచ్చిన నాటి చేనేతకేంద్రం మంగళగిరికి తిరిగి ఆ శోభ సంతరించుకోకున్నది. వివిధ కారణాలతో ఐదారు వేల మగ్గాలు ప్రస్తుతం 14 వందలకు తగ్గిపోయాయి. మంగళగిరిలో ప్రాభవం కోల్పోయిన నాటి చేనేత కళకు పునరుజ్జీవం పోయాలని దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నేతన్నలతోపాటు చేనేత కార్మికసంఘాలు, వామపక్ష పార్టీలు పాలకప్రభుత్వాలను వేడుకుంటూనే ఉన్నాయి. అడపాదడపా పోరాటాలు కూడా చేస్తూ వచ్చాయి. కానీ స్పందన మాత్రం శూన్యం. ఏళ్లుగా మెగా చేనేత పార్కు మంగళగిరివాసులను ఊరిస్తూ వస్తోన్నది. అయితే నారా లోకేశ్ తన రాజకీయ జీవితానికి చేనేత కేంద్రమైన మంగళగిరేనే ఎంచుకోవడంతో మంగళగిరి దశ తిరిగింది. ఈ క్రమంలో మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఆవిర్భవించబోతుంది. నగరంలోని ఆటోనగర్‌కు వెనుకవైపు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబరు 16లోని 10.80 ఎకరాలను 31 ఏళ్ల లీజుకు తీసుకుని చేనేత పార్కును నెలకొల్పేందుకు చేనేత జౌళి శాఖ సిద్ధమైంది. ఎకరాకు రూ.25 వేల వంతున..ప్రతీ మూడేళ్లకు పది శాతం వంతున లీజు పెంచేలా దేవదాయశాఖతో చేనేత జౌళిశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. చేనేతపార్కు కోసం నిర్దేశించిన ఈ స్థలాన్ని ఆ శాఖ మంత్రి ఎస్ సవిత సంబంధితశాఖ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పార్కును తమిళనాడులోని (మిగతా 8వ పేజీలో)

ఆటోనగర్‌లో ఇప్పటికే వీవర్స్‌శాల

లోకేశ్ ఆటోనగర్ ప్రాంతంలో తన సొంత ఖర్చులతో లోకేశ్ ప్రత్యేకంగా వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణను ఇప్పిస్తున్నారు. తయారైన వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో తృప్తి చెందని లోకేశ్ మంగళగిరికి ఒక నాటి ఖ్యాతిని మళ్లీ తెచ్చేందుకు ప్రత్యేకంగా చేనేత పార్కు నిర్మాణానికి పూనుకున్నారు.



రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనం (ఊహాచిత్రం)



వేర్‌హౌస్ (ఊహాచిత్రం)

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు
❖ బొమ్మరాజు పల్లి సమీపంలో మృతదేహం లభ్యం

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

మాచర్లలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య


ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

6

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి షాక్?

- పోటీలో ఉన్న ఆ పార్టీ అభ్యర్థి టీడీపీలో చేరిక
- ఇప్పటికే ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ
- 3న నగర పాలక సంస్థ ఎన్నిక.. బరిలో 12 మంది కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి జరుగుతున్న ఎన్నికలలో వైసీపీకి షాక్ తగిలింది. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఆ పార్టీని వీడగా తాజాగా అడకా పద్మావతి టీడీపీలో చేరారు. పద్మావతి వైసీపీ తరపున స్టాండింగ్ కమిటీ ఎన్నికలో నామినేషన్ వేశారు. అయితే ఆమె గురువారం ఎమ్మెల్యే గళ్లా మాధవి సమక్షంలో టీడీపీలో చేరారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు మచ్చల వెంకటరెడ్డి, షేక్ రోషన్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో వైసీపీ తరపున పోటీలో కేవలం ఐదుగురు మాత్రమే మిగిలారు. జనసేన తరపున ఇద్దరు, టీడీపీ తరపున ఐదు గురు ఎన్నికల బరిలో ఉన్నారు. 3న జరిగే స్టాండింగ్ ఎన్నికలో ఆరు పదవులను కైవసం చేసు కునే విధంగా కూటమి నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసీపీకి భంగపాటు తప్పదని తెలుస్తోంది.



ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ

3న జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజైన గురువారం ముగ్గురు ఉపసంహరించుకున్నట్లు ఏసీ, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. మొత్తం 17 నామినేషన్లు దాఖలు కాగా వారిలో పఠాన్ రిహాన, తెలుకుట్ల హనుమాయమ్మ, పోతురాజు సమత, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉపసంహరణల అనంతరం తుది పోటీలో అడకా పద్మావతి, అంజలి మర్రి, ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, గోపి శ్రీనివాస్, దాసరి లక్ష్మీదుర్గ, దూపాటి వంశీబాబు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, యాట్ల రవికుమార్, రాజలత బూసి, షేక్ మీరావలి ఉన్నారు.

పకడ్బందీగా.. ఎలక్షన్ కోడ్

- మండలి ఎన్నికలకు ముందస్తు చర్యలు

3,46,614 మంది ఓటర్లు.. 416 పోలింగ్ స్టేషన్లు

ఎన్నికలపై సమీక్షలో రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాస న మండలికి సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినందున ఎన్నికలు ముగిసే వరకు ఎలక్షన్ కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వెబ్ ఎక్స్ ద్వారా బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు ఎస్పీలు, డీఆర్వోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తెనాలి సబ్‌కలెక్టర్‌తో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఈ నెల 29 నుంచే అమల్లోకి వచ్చిందన్నారు. 3న నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. శాసనమండలికి జరిగే ఎన్నికలు సజావుగా చేపట్టేందుకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచ తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజకీయ నాయకుల బ్యానర్లు, పోస్టర్లు, చిత్రపటాలు తొలగించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. రాజకీయ పార్టీ నేతల విగ్రహాలకు ముసుగేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరు దరఖాస్తులను ఫిబ్రవరి 10 లోపు పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్ల వివరాలు శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని తెలిపారు. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందున బ్యాలెట్ బాక్సుల లభ్యత వివరాలు తెలపాలన్నారు. బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయాలన్నారు.



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజకీయ పార్టీలు సహకరించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణ - గుంటూరు జిల్లాలకు సంబంధించి ఈ నెల 29కి 2,06,225 మంది పురుషులు, 1,40,344 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్స్ కలిపి మొత్తం 3,46,614 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ స్థలాల్లో సమావేశాలు, ర్యాలీలకి ఆర్వో వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, జేసీ భార్గవతేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీసీవో వీరాచారి, డీపీవో నాగసాయి, మైన్స్ డీడీ శ్రీవెంకటసాయి, ఉద్యాన డీడీ రవీంద్ర, డ్వామా పీడీ శంకర్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ లక్ష్మి, పశు సంవర్థక శాఖ జేడీ నరసింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్యతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు చిరతనగండ్ల వాసు, చరక కుమారగౌడ్, వై కృష్ణకాంత్, కంచర్ల శివరామయ్య, గాదె వెంకటేశ్వరరావు, అత్తోట జోసఫ్, బిల్లా సునీల్, సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.23 కోట్లు ఏమయ్యాయి?

- 230 మందికి సమన్లు.. 1340 ప్లెడ్జి రుణ గ్రహీతలకు నోటీసు
- నల్లపాడు జీడీసీసీ బ్యాంకు అక్రమాలపై మొదలైన విచారణ

గుంటూరు సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు జీడీసీసీ (గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. తెనాలి డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన విచారణ బృందం బ్యాంకు పరిధిలో మంజూరు చేసిన అన్ని రుణాలను పరిశీలిస్తోంది. బ్యాంకు పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు ఇచ్చిన ప్లెడ్జి రుణాలపై పరిశీలన జరుగుతుంది. ఆయా కోల్డ్ స్టోరేజీలకు ప్లెడ్జి రుణం కింద సుమారు రూ.60 కోట్ల వరకు విడుదల చేయగా వాటిలో కొంత చెల్లించారు. ఇంకా రూ.23 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. 17 కోల్డ్ స్టోరేజీలలో 4 కోల్డ్ స్టోరేజీలు తీసుకున్న బకాయిలు పూర్తిగా చెల్లించినట్లు తెలుస్తోంది. మిగిలిన 13 కోల్డ్ స్టోరేజీల రుణాలపైనే విచారణ చేయాలి. ఈ నేపథ్యంలో 230 మంది రుణ గ్రహీతలకు విచారణ అధికారులు సమన్లు జారీ చేయనున్నట్లు తెలిసింది. వారికి సమన్లు జారీ చేస్తేనే అసలు రుణాలు తీసుకున్నారా.. లేదా.. అనే విషయం తేలుతుందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకు పరిధిలో మంజూరైన 1340 ప్లెడ్జి రుణాలను పరిశీలించి అధికారులు నివేదిక తయారు చేయనున్నారు. అసలు రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు నిబంధనలు ఏ మేరకు పాటించారు అన్న దానిపై కూడా విచారణ జరగనుంది. బ్యాంకు రుణాల మంజూరుపై విచారణ జరుపుతున్న అధికారులు మే నెలలో నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.



గుంటూరులోని జీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఆంధ్రజ్యోతి కథనంతో..

దొరికితే దొంగ లేకపోతే లేదన్నట్లుగా నల్లపాడు జీడీసీసీబీ పరిస్థితి ఉంది. బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ జరగనుందని ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి' లో కథనం ప్రచురితం కాగా ప్లెడ్జి రుణాలలో రూ.37 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. మిగిలిన రూ.23 కోట్లు కూడా రాబట్టగలిగితే జీడీసీసీ ఉనికికి ముప్పు రాకుండా కాపాడవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హేతుబద్ధీకరణపై కమిటీ వేయండి

● సీఎంకు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధీకరణ అంశంపై సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి హేతుబద్ధీకరణపై సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందున రావాల్సిన బకాయిలు, ప్రొబేషన్ డిక్లరేషన్ అయిన నాటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్, పే-రి విజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, మెరుగైన ఐఆర్ ప్రకటించాలని, ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్ కుమార్, నాగ సాయి, బాజీ పఠాన్, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్, సుగుణ, రవీంద్ర రాజు, కేదేశ్వరరావు, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9329 మంది హాజరవుగా 5198 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో జవాబు పత్రానికి రూ. 1490 ఫిబ్రవరి 13వ తేదీలోగా చెల్లించి కళాశాల ద్వారా డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్, ఆచార్య కె. ధనలక్ష్మి, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, సీటీఏ, ఏసీటీఏ పరీక్షల అధికారులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు విశ్వవిద్యాలయం ఘన నివాళులు అర్పించింది. గురువారం మహాత్మ గాంధీ విగ్రహం వద్ద వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సోమశేఖర్ వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మహాత్మ గాంధీకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ గాంధీ చూపిన అడుగుజాడల్లో నడిచి సమాజాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ సూచించిన సత్యం, అహింస మార్గాలను ఎంచుకున్న వారు జీవితంలో వెనుకడుగు వేయరని, ఆ విధంగా నేటి యువత లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఏ. ప్రమీలారాణి, కోఆర్డినేటర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాతలుగా పూలే దంపతులు

● మహిళా విద్య, ఉపాధితోనే దేశాభివృద్ధి సాధ్యం
● జాతీయ సదస్సులో వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల కృషి అనిర్వచనీయమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే కాంట్రిబ్యూషన్ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు విద్యావంతులు అయినట్లయితే దేశాభివృద్ధితోపాటు ప్రపంచ వృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. 19వ శతాబ్దంలో పూలే దంపతులు సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కనీస అవసరాలు లేని ఆ రోజుల్లోనే విద్యకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన వీరు అవిరళ కృషిని చేశారని కొనియాడారు. పూలే సంస్కరణలు, సావిత్రిబాయి పూలే ఆచరణలు నేటి సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య టి. రమేష్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాల్లో మహిళలు రాణిస్తున్నారంటే దానికి సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే ఆనాడు తీసుకొచ్చిన సంస్కరణలు కీలకంగా ఉన్నాయన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మహిళ సాధికారత సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని గుర్తు చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి అన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ రెండు రోజుల ఈ జాతీయ సదస్సుకు అనూహ్య రీతిలో పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ ఆచార్య డి.రామారావు, సదస్సు కోశాధికారి ఆచార్య కె.ధనలక్ష్మి, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య అశోక్ కుమార్, ఆచార్య తులసీదాస్, విభాగం ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో సరికొత్త రికార్డులు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రాంతానికి కొత్త పరిశ్రమ వచ్చేలా, ప్రతి ప్రాంతం ఒక్కో రంగంలో గుర్తింపు పొందేలా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షిస్తున్న ఫలితాలు త్వరలోనే అంతా చూస్తారని అన్నారు. చంద్రబాబు నాయుడు దీర్ఘకాలిక లక్ష్యాలలో ప్రస్తుతం చూస్తున్న ఫలితాలు ప్రారంభం మాత్రమేనని, కేవలం ప్రభుత్వం వచ్చిన ఏడు నెలలో రూ.6,33,568 కోట్లు పెట్టుబడులతో 4 లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చే సాహసం ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, అమరావతి, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని, అందుకోసం రాష్ట్రానికి 20 భారీ పరిశ్రమలను సాధించుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కే చెల్లుతుందన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకపోవటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా జగన్‌రెడ్డి అండ్ గ్యాంగ్‌కు ఎప్పుడూ ఏడుపే అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జాస్తి చంద్రశేఖర్, దండా అనీల్ పాల్గొన్నారు.

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు

● బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం లభ్యం



కొండయ్య మృతదేహం

ఈపూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకే కాలయముడై కాలువ నీటిలో పడేసి హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన నూజండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య(85)ను పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు కారులో తీసుకువచ్చి భద్రుపాలెం వద్ద నాగార్జున సాగరు కుడిప్రధాన కాలువ నీటిలో పడేశాడు. అక్కడకు కొద్ది దూరంలో ఉన్న గ్రామస్తులు చూసి వెంకటేశ్వర్లును పట్టుకొని దేహశుద్ధి చేయగా, ఇంట్లో గొడవలు కారణంగా నా తండ్రి, నేను కాలువలో దూకి చనిపోయేందుకు వచ్చామని వెంకటేశ్వర్లు వారికి చెప్పాడు. గ్రామస్తులు వెంకటేశ్వర్లును పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. కాలువ నీటిలో వృద్ధుడు కొద్దిసేపు ఈతకొట్టి నీటిలో మునిగినట్లు చెప్పారు. వృద్ధుడిని రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా డీప్‌కట్ కావడంతో లోతు ఎక్కువగా ఉండి మునిగిపోయాడు. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొండయ్య, శిరోమణి దంపతులకు ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. కొండయ్య, భార్య శిరోమణి పంపకాలలో తమకు వచ్చిన ఆస్థిని విక్రయించగా వచ్చిన సుమారు రూ.20 లక్షలు తీసుకు వెళ్లి మూడు సంవత్సరాల కితం పెద్ద కొడుకు వెంకటేశ్వర్లుకు ఇచ్చి అతని వద్దే ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం తల్లి శిరోమణి చనిపోయింది. కొండయ్య వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. వృద్ధుడైన తండ్రి వలన తరచూ ఇంట్లో గొడవలు వస్తున్నాయి. ఈక్రమంలో గురువారం వెంకటేశ్వర్లు ఇంట్లో భార్య అనూరాధతో గొడవపడ్డాడు. ఆ సమయంలో భార్య స్పృహతప్పి పడిపోయింది. వెంకటేశ్వర్లు ఆవేశంతో వేరే వాళ్ల కారు అద్దెకు తీసుకొని వచ్చి అందులో తండ్రి కొండయ్యను తీసుకుని వెళ్లి కాలువలో పడేశాడు. గురువారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వినుకొండ రూరల్ సీఐ ఆర్ ప్రభాకర్ గ్రామస్తులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు తమ అదుపులో లేడని ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు చెప్పారు.

దాడి చేసిన భర్త బంధువులపై కేసు

కొల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భర్త అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వచ్చిన భార్య, అత్తమామలపై మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల గ్రామం క్రాపకు చెందిన పట్టాభి అరుణ్ కుమార్ (28) చేబ్రోలు మండలానికి చెందిన కఠారి వైశాలి అనే మైనర్‌ను గతేడాది అక్టోబరు 10న వివాహం చేసుకున్నాడు. ఎటువంటి పనులు చేయకుండా ఖాళీగా తిరుగుతూ మద్యం తాగి భార్యను వేధిస్తున్నాడు. గతేడాది నవంబరు 10న మృతుడు అరుణ్ కుమార్ సోదరి భర్త పులివర్తి రవి మృతుని భార్యను పుట్టింటికి పంపించి వచ్చాడు. ఈ క్రమంలో పుట్టింట్లో భార్య వద్దకు తరచూ వచ్చి వెళుతున్న అల్లుడిని అత్తమామలు తమ కుమార్తెను కాపురానికి తీసుకు వెళ్లాలని కోరారు. ఈ నెల 23న తమ బంధువు చిలకా కిరణ్, ఇతర పెద్ద మనుషుల సమక్షంలో తెనాలిలో భార్యను కాపురానికి తీసుకు వెళ్లే విషయమై మృతునితో చర్చించి మందలించారు. దీంతో పెద్ద మనుషులను తీసుకువచ్చి తన భార్యను కాపురానికి తీసుకు వెళ్తానని చెప్పాడు. అదే రోజు అర్ధరాత్రి తెనాలిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన మృతుని స్నేహితుడు, మృతుడు భార్య పురుగు మందు తాగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వైద్యశాలకు తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్ పరిస్థితి విషమించడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 28న మృతి చెందాడు. మృతుని ఖననం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భార్య, ఆమె తల్లి ధనలక్ష్మిపై మృతుని బంధువులు ఇంట్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మృతుడి బావ పుల్లారావు, తల్లి రాజకుమారి, మృతుడు సోదరి శారద, ఆమె భర్త రవిలు మృతుని భార్య వైశాలిని గర్భవతి అని చూడకుండా కడుపుపై తన్నారు. ఇదే సమయంలో బయట ఉన్న ఆమె తండ్రి భూషణంపై కూడా పది మంది ముకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు అడ్డుపడి సర్ది చెప్పి ఆటోలో పంపించగా వేమూరు మండలం జంపని వద్దకు చేరుకుని అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో తెనాలి వైద్యశాలకు వెళ్లారు. భర్తను కోల్పోయి భర్త కుటుంబ సభ్యుల దాడికి గురైన బాధితురాలు చికిత్స పొందుతూ వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ అర్జున్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

● ఫోన్ నంబరు ఆధారంగా గుర్తించిన పోలీసులు

దాచేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన విద్యార్థులను 24 గంటలలోపే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం దాచేపల్లిలో చోటు చేసుకుంది. దాచేపల్లి ఎస్ఐ సౌందర్ రాజన్, ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన ఇర్ల శ్రీనివాసరావు, మీసాల డేవిడ్‌రాజు, చర్లపల్లి నగేష్ కృష్ణ 8వ తరగతి చదువుతున్నారు. వీరు బుధవారం మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా నడికుడి రైల్వే స్టేషన్ నుంచి రైలు ఎక్కి తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్లకు చేరుకున్నారు. వారి ముగ్గురిలో ఒకరి వద్ద సెల్ ఫోన్ ఉంది. సెల్ ఫోన్ నంబరు ఆధారంగా వారి అడ్రస్‌ను కనుగొన్నారు. తెలంగాణ పోలీసుల సహకారంతో వారిని పోలీసుల అదుపులో ఉంచారు. కుటుంబ సభ్యులు, పోలీసులు కలిసి ప్రైవేట్ వాహనంలో జడ్చర్లకు చేరుకొని పిల్లలను తీసుకొని దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటి వరకు తీవ్ర ఆందోళనతో ఉన్న తల్లిదండ్రులు పిల్లలను చూసి పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు, చేసిన సేవలు స్థానిక ప్రజలు ప్రశంసలు అందజేశారు.



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దాచేపల్లి పోలీసులు

కృత్రిమ మేధతో ఔషధాల విశ్లేషణ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మొంటు కుమార్ ఎం పటేల్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధా) ద్వారా ఔషధాల డేటాను విశ్లేషించవచ్చునని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మొంటు కుమార్ ఎం పటేల్ అన్నారు. గురువారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)లో జరిగిన ఫార్మా నెక్స్ జాతీయ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అధ్యక్షత వహించారు. డాక్టర్ మొంటు కుమార్ ఎం పటేల్ మాట్లాడుతూ ఔషధాల పరస్పర చర్యలను కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించడానికి అవకాశం ఉందన్నారు. ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధా కీలక భూమిక పోషించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఔషధాలు తయారీ, పరిశోధన వంటి రంగాల్లో దీని పాత్ర వేగవంతం కానున్నట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ ప్రసంగిస్తూ ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ నిరంజన్ బాబు, డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, ఏపీ ఫార్మసీ కౌన్సిలర్ రిజిస్టర్ డాక్టర్ విలియం క్యారీ, చిప్స్ కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ సిలబస్ డిజిటలైజేషన్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న పరిశ్రమ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయనున్నట్లు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మొంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మొంటు కుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీలపైన ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నెలా 150 మంది విద్యార్థులకు ట్రైనింగ్ అందించడానికి వీలుగా ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

జువాలజీ విభాగంలో ముగిసిన జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి, పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. సదస్సు ముగింపు సందర్భంగా డైరెక్టర్ ఆచార్య వి.వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ఈ సదస్సులో వాతావరణ కాలుష్యం, కలుషిత వ్యర్థాల పరిణామాలు, వాటి నివారణ చర్యలు చర్చించినట్లు తెలిపారు. అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు తమ విలువైన సలహాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.భాస్కర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, సదస్సు కో డైరెక్టర్ ఆచార్య పి.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆచార్య కె.సుమంత్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు

అచ్చంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద గురువారం జిల్లా మత్స్య శాఖ అధికారులు ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల్లో జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. చేప పిల్లల విడుదలతో ఆ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యువజన పథకం ద్వారా 52 లక్షల చేప పిల్లలకు గానూ మొదటి విడతగా పులిచింతల జలాశయంలో ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీఈఈ టి.అరుణ కుమారి, కిషోర్, లలిత, శోభ, నాగార్జున సాగర్ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వీవీఏ శ్రీనివాసరావు, మత్స్య శాఖ సహాయ పర్యవేక్షకులు కె.భాగ్యలత, అచ్చంపేట తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ గదిలో విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

మాచర్లటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాచర్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం లోయపల్లికి చెందిన పందిరి రాజశేఖర్ (15) పట్టణంలోని రాయవరంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లోని హాస్టల్‌లోనే ఉంటూ విద్యను కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒంటరిగా హాస్టల్ గదికి వచ్చి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సరికి అప్పటికే రాజశేఖర్ మృతి చెంది ఉన్నాడు. స్కూల్ యాజమాన్యం రాజశేఖర్ మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వేటపాలెం ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని కానుకమాత 175వ తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన 6 పళ్ల ఒంగోలు జాతి పశుప్రదర్శన రక్తి కట్టించింది. అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి(వేటపాలెం,బాపట్ల జిల్లా) చెందిన ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, మోదుగు రామిరెడ్డి(పెదపరిమి), రామినేని రత్తయ్య చౌదరి (చేబ్రోలు) కంబైన్డ్ జత 4049.6 ద్వితీయ బహుమతి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, ఏటుకూరి శ్రీనివాసరావు (పల్నాడు) 3600 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు (పెనమలూరు, కృష్ణా జిల్లా)3487.3 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, మేకా అంజిరెడ్డి(చల్లగుండ్ల, నకరికల్లు) 3347.1 దూరం లాగి ఐదో బహుమతిని గెలుచుకున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 552.70 అడుగులు ఉంది. ఇది 215.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,685 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,168 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

1,09,020 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,02,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,09,020 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,402 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7000	13600
నెంబరు. 5	8000	14000
273	10000	10000
341	8000	15000
4884	10500	10500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7000	15000
బ్యాడిగి	7500	13500
దేవనూరు డీలక్స్	8500	13500
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13000
నెంబరు.5	--	--
273	9200	9200
341	8500	11000
4884	--	--
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	13500
బ్యాడిగి	8000	11500
దేవనూరు డీలక్స్	12000	12000
తెల్లకాయలు	4000	8500

నేడు క్షేత్రస్థాయి మహిళా నాయకుల రాష్ట్ర సదస్సు

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి మహిళా నాయకులు రాష్ట్ర స్థాయి సదస్సు అమరావతి రోడ్డు గోరంట్ల డి స్క్వేర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు డీబీఆర్‌సీ డైరెక్టర్ అల్లడి దేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు) హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో న్యూరోపతిని నిరోధించవచ్చు

గుంటూరు మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాల మధుమేహ బాధితుల్లో తలెత్తే నరాల సమస్య డయాబెటిక్ న్యూరోపతిని ముందు జాగ్రత్తల ద్వారా నిరోధించవచ్చని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో మీటింగ్ హాల్‌లో గురువారం జరిగిన ఉచిత న్యూరోపతి వైద్య శిబిరంలో ఆయన ప్రసంగించారు. దీర్ఘకాలం రక్తంలో షుగర్ స్థాయి అధికంగా ఉండటం వల్ల నరాలు దెబ్బతిని అరిచేతులు, అరికాళ్లల్లో తిమ్మిర్లు, మంటలు ఉంటాయని తెలిపారు. ఆహారంలో సరైన మోతాదులో 'బి' కాంప్లెక్స్‌తో పాటు కొన్ని ఇతర విటమిన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. డయాబెటిస్ న్యూరోపతిని బయోథీసియోమీటర్ ద్వారా నిర్ధారణ చేసి, వైద్యనిపుణుల దగ్గర తగిన చికిత్సలు పొందడం ద్వారా న్యూరోపతి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం రోగులకు న్యూరోపతి వైద్యపరీక్షలు చేసి తగిన సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో మేనేజర్ పీ నిర్మల రాణి, డి శివసత్యనారాయణ, సాయిరాం, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్థసారథి, పాల్గొన్న బ్రహ్మారెడ్డి, కన్నా మాష్టారు తదితరులు

అంధుల అక్షర శిల్పి లూయి బ్రెయిలీ

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): అంధత్వం మనిషి శరీరానికే కానీ.. మానవ మేధస్సుకు ఏమాత్రం కాదని నిరూపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. జాతీయ అంధుల సమైక్య అమరావతి శాఖ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు క్లబ్‌లో 216వ లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని జయించడమే గాక అంధులకు ప్రత్యేక లిపి ద్వారా సరికొత్త లోకాన్ని సృష్టించిన బ్రెయిలీ అందరికి ఆదర్శమని అన్నారు. సామాన్యులతో సమానంగా అన్ని రంగాలలో ముందుండేలా పటిష్ఠ సంకల్పాన్ని స్థిరపరుచుకోవాలని సూచించారు. వారికి అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, గుంటూరు క్లబ్ డైరెక్టర్ వి బ్రహ్మారెడ్డి, కార్యదర్శి యస్ సాంబశివం రావు, 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్ శరత్‌బాబు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలావతి, కన్నా స్కూల్ కరస్పాండెంట్ కన్నా మాష్టారు, షిరిడి సాయి దీన జనసేవ సమితి ఛైర్మన్ ఏ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

5న జరిగే నిరసనలు జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే నిరసనలను జయప్రదం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన నిరసనల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కే శ్రీనివాసరావు, బీ లక్ష్మణరావు, బీ ముత్యాలరావు, ఏ అరుణ్, ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందించడం హర్షణీయం

గుంటూరు (విద్య) యనమల 30 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించిన లైన్స్ క్లబ్ సేవలు హర్షణీయమని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసిం అన్నారు. స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజుల నుంచి ఐదు వేల రూపాయలు వ్యయంతో 10వ తరగతి విద్యార్థులకు గుంటూరు లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వీర ప్రకాష్ సహకారంతో అల్పాహారం అందించడాన్ని ఆయన అభినందించారు. సేవా సంస్థల సహకారం ప్రభుత్వ పాఠశాలకు అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు లయన్స్ క్లబ్ పట్టాభిపురం అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ రోషన్, పీఆర్‌ఓ వెంకట నరేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న వరప్రసాద్, సత్యం, ప్రసాద్ తదితరులు

నేటి నుంచి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేకపూజలు

● ఎన్నికల కోడ్‌తో ప్రభుత్వ లాంఛనాలు నిలిపివేత

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఫిబ్రవరి 4 వరకు ఏటుకూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్(బాబు), ఏపీ ఆర్యవైశ్య సంఘం ఈసీ సభ్యుడు కొనకళ్ల సత్యం, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుడివాడ రవీంద్రకుమార్ తెలిపారు. దేవస్థానంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అర్బన్‌జిల్లా ఆర్యవైశ్య సంఘంతో పాటు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో శుక్రవారం మాఘశుద్ధ విదియ తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అనంతరం లక్ష్మీగణపతి శ్రీ వాస్తు, రుద్ర, చండీ హోమాలు , పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 1న సామూహిక లక్ష కుంకుమార్చన, 2, 3, 4 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలు అందించాల్సి ఉందని, అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దానిని నిలిపివేయాల్సి వచ్చిందని వివరించారు. విలేకరుల సమావేశంలో పాలక మండలి సభ్యుడు నిడమానూరు సురేష్, బైసాని ఇందుమతి, బొలిశెట్టి బాపారావు, తల్లం శేఖర్, గజవల్లి అంకారావు, ఇమ్మడి శ్రీనివాసమూర్తి, మహిళా సంఘం అధ్యక్షురాలు ఓలేటి షర్మిల, తడవర్తి నాగలక్ష్మి, హరిప్రసాద్, అర్జునరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

యుద్ధకాండపై ప్రవచనం


ప్రవచనం చేస్తున్న డాక్టర్ బాచంపల్లి సంతోష కుమార్ శర్మ

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ముప్పవరపు కేశవరావు శత జయంతిని పురస్కరించుకుని జరుగుతున్న మద్రామాయణ ప్రవచనాలు కొనసాగుతున్నాయి. నవాహ జ్ఞాన యజ్ఞంలో భాగంగా గురువారం డాక్టర్ బాచంపల్లి సంతోషకుమార్ శాస్త్రి యుద్ధ కాండలోని పలు ఘట్టాలపై ప్రవచనాలు చేశారు. ముఖ్యఅతిథిగా కాకినాడ, ఉపకర్మాగారాల ముఖ్య తనిఖీ అధికారి, డీ రాధాకృష్ణ పాల్గొన్నారు. వేదపండితుల వేద పారాయణంతో సింహాచలశాస్త్రి, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

'మహాత్ముడి ఆశయసాధనకు కృషి చేద్దాం'

● గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యేలు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, నాయకులు

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి పిలుపు నిచ్చారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు మహాత్ముడు తన జీవితాన్ని అర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటీ వరప్రసాద్, పెండ్యాల నర్సయ్య పాల్గొన్నారు.

అహింసా ఆయుధం.. ప్రపంచానికి మార్గదర్శకం

గాంధీ మహాత్ముడు అందిం చిన అహింసా ఆయుధం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక హిమని సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డారని, ఆయన స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, కొనాకళ్ల సత్యం, మహమ్మద్ హఫీజ్, అబ్దుల్ సలీం, దుర్గా, కొత్తూరు వెంకట్, పాకనాటి రమాదేవి, తిరుపతిరావు, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, రామతున్నిసా, ఫిరోజ్ పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, నాయకులు

జిల్లా టీడీపీ కార్యాలయంలో..

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో పలువురు నాయకులు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం, సమానత్వం, అహింస కోసం పోరాడిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో కొత్తూరి వెంకట్, వేములకొండ శ్రీనివాస్, ఈరంటి వరప్రసాద్ బాబు, బొబ్బిలి రామారావు, కొనకళ్ల సత్యనారాయణ, లామ్ నవమి తదితరులు పాల్గొన్నారు


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నేతల నివాళి

గుంటూరు, జనవరి 39(ఆంధ్రజ్యోతి): గాంధీజీ చిత్రపటానికి స్థానిక రాజీవ్‌గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి పార్టీ నాయకులు రాచకొండ జాన్‌బాబు, గడ్డం పాల్ విజయ్‌కుమార్, బిళ్లా సునీల్‌కుమార్, తోడేటి సందీప్‌లు నివాళులర్పించారు. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతోనే దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిందని నేతలు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యన్నం సుధీర్‌బాబు, కరీం, సయ్యద్ సుభాని, చుక్కా చంద్రపాల్, అంబటి రత్తయ్య, వెంకటకృష్ణ, షైలా కిరణ్ , రామకృష్ణ తదితరులున్నారు.

● స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. గాంధేయవాది అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గమే భారత జాతికి భగవద్గీత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కె చంద్రశేఖర్, సాయిరాం, సదాశివం, సింగరయ్య తదితరులున్నారు.

జగన్ అప్పుల పాపం.. ప్రజలకు శాపం: ఎమ్మెల్యే నసీర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలం రాష్ట్ర చరిత్రలో చీకటి రోజులని, అది రాష్ట్ర ప్రజలకు శాపంగా మారిందని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.10 లక్షల కోట్ల అప్పు రాష్ట్ర ప్రజలపై ఉందని, అది జగన్ చేసిన పాపమని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటు అభివృద్ధిపై దృష్టి పెడుతూనే మరో వైపు ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, రూ.1.40 లక్షల కోట్ల వడ్డీ చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రియంబర్స్మెంట్‌కు సంబంధించి రూ.22 వేల కోట్ల బకాయిలను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. జగన్ హయాంలో రూ. 19,872 కోట్లు దుబారా చేశారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులున్నా రాష్ట్ర ప్రభుత్వం అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని సమన్వయంతో ముందుకు నడిపిస్తోందని, ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరారు.

వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి):జగన్ మోహన్ రెడ్డి తప్పుడు నిర్ణయాలు, దోపిడీ, జల్సాల దెబ్బకి ఆంధ్రప్రదేశ్ కుదేలయిందని ఎమ్మెల్యే గల్లా మాధవి ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆమె నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాల అమలుపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 2019- 2024 కాలం నియంత జగన్ చేతిలో విధ్వంసక యుగమని, తప్పుడు నిర్ణయాలు, దోపిడీ, జల్సాల దెబ్బకి ఆంధ్రప్రదేశ్ కుదేలై పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అభి వృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తూ, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశారన్నారు. తమ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం గుంటూరులోని తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత స్థానిక చుట్టుగుంట సెంటర్‌లోని అన్నా క్యాంటీన్‌ను సం దర్శించిన ఎమ్మెల్యే, అక్కడే భోజనం చేశారు. భోజనం నాణ్యతపై ప్రజలతో మాట్లాడారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, ఆహారం నాణ్యతపై తన పక్కనే ఉన్న మహిళను అడిగి తెలుసుకుంటున్న చిత్రం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన చెరుకూరు తిరుపతి రావు ఎమ్మెల్యే మాధవిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిరావును దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీలో చేరిన కార్పొరేటర్ పద్మావతి


ఎమ్మెల్యే మాధవి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్ పద్మావతి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజక వర్గం 24వ డివిజన్‌కు చెందిన వైసీపీ కార్పొరేటర్ అడకా పద్మావతి ఎమ్మెల్యే మాధవి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పిన ఎమ్మెల్యే, టీడీపీలోకి సాద రంగా ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఒక్క అడుగుపడని పనులను సంవత్సరకాలంలోపే శ్రీకారం చుట్టి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వీటికి వైసీపీ కార్పొరేటర్లు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు వైసీపీ కార్పొరేటర్లు వాళ్ల పార్టీని వీడి టీడీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేక 'పశువులు' అంటూ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండిం చారు. పద్మావతి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగమయ్యేందుకే తాను టీడీపీలో చేరుతున్నట్టు పద్మావతి తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రజలకు ఎంతో మేలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ కుమార్



గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను అందించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో ఇటు వంటి వాట్సాప్ పరిపాలన విధానం చేపట్టడం వలన ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ, వ్యయ, ప్రయాసలు తగ్గుతాయని అన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినంద నీయమని అన్నారు. తొలి దశలో దీని ద్వారా 161 రకాల పౌర సేవలు అందిస్తున్నారని, రెండో విడత మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకు రానున్నారని తెలిపారు. తొలి విడత దేవాదాయ, ఇంధన, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ ,మున్సిపల్ తదితర శాఖలలో ఈ సేవలు ప్రారంభమైనట్లు వెల్లడించారు. దీని కోసం అధికారిక వాట్సాప్ నంబర్ కూడా ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముందుచూపుతో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ విధా నాన్ని ప్రవేశ పెట్టడం వల్ల రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందని అభిప్రాయపడ్డారు.


వాహన చోదకులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ అజీజ్, సీఐ సోమయ్య

మహిళలకూ హెల్మెట్ తప్పనిసరి

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు కూడా హెల్మెట్ తప్పనిసరి అని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈస్ట్ సబ్ డివిజన్‌లోని లాలాపేట, కొత్తపేట, పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సంయుక్తంగా హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ కాలేజ్ స్టూడెంట్స్, మహిళలు పాల్గొన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తోపాటు పాత గుంటూరు సీఐ సోమయ్య, కొత్తపేట ఎస్సై తరంగిణి పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసరిపాలెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనలో నెహ్రూనగర్ 8వ లైన్ కి చెందిన పరిశుద్ధ బాబు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మధు అనే మరో యువకుడు గాయపడ్డాడు. పరిశుద్ధబాబు, మధులు ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి గుంటూరు వస్తుండగా దాసరి పాలెం వద్దకు రాగానే జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఇరువురిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు.

పరిశుద్ధబాబు తల్లి చిన్నతనంలోనే మృతి చెందగా ఆయనకు సమీప బంధువైన ఓ మహిళ అతన్ని పెంచుకున్నారు. రోడ్డు ప్రమాదంలో పరిశుద్ధబాబు మృతి వార్త తెలుసుకున్న అతని బంధువులు, స్నేహితులు జీజీహెచ్‌కు చేరుకున్నారు. పరిశుద్ధబాబు మృతదేహానికి పోస్టుమార్టం వద్దని పోలీసులపై ఒత్తిడి చేశారు. దీంతో కొత్తపేట ఎస్సై హనుమంతరావు ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులు స్నేహితులకు నచ్చజెప్పారు.


ప్రజలతో మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

వార్డుల వారీగా అండర్, అన్ అసెస్మెంట్‌ల సర్వే చేపట్టాలి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల వారీగా అండర్, అన్ అసెస్మెంట్‌ల క్షేత్ర స్థాయి సర్వే చేప ట్టాలని, ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక నల్ల చెరువు, నంబూరి సుభాని కాలనీ, శివరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆస్తి పన్ను వసూళ్ల, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరి శీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు పన్నుల వసూళ్ల కీలకమని, నూరు శాతం పన్నుల వసూళ్లకు వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్య దర్శులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు తమ పరిధిలో ర్యాండమ్‌గా ఆస్తి పన్నులను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనం తరం ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమా ణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లోని డ్రైన్లలో మురుగు పారుదల లేకపోవడాన్ని ఆయన గమనించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అడకా పద్మావతి, డీఈఈ మధుబాబు, రెవెన్యూ అధికారి మదన్ గోపాల్, ఆర్‌ఐలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏడు నెలల్లో ఏడేళ్ల అభివృద్ధి చేసిన చంద్రబాబు

● ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్



గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గడిచిన ఏడు నెలల్లో ఏడేళ్ల అభివృద్ధిని చేసి చూపించిన దార్శనికుడు చంద్రబాబునాయుడు అని ఆంధ్రప్రదేశ్ ఇండ స్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) ఛైర్మన్ డేగల ప్రభాకర్ కొని యాడారు. టీడీపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లా డారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు పూర్తి కాని, మరమ్మతులు చేయలేని గ్రామ, పట్టణ, రాష్ట్ర రహదారులను పూర్తి చేసి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. ఓ వైపు అప్పుల కుప్ప, మరో వైపు బకాయిల తట్ట దర్శనమిస్తున్నా, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననను కూటమి ప్రభు త్వం పొందు తోందన్నారు. పింఛనును రూ. 1000 పెంచడానికే జగన్ రెడ్డికి ఐదేళ్లు పట్టింది కానీ, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే రూ. 3వేలు ఉన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను రూ.4 వేలు చేశారన్నారు. దీపం పథకాన్ని పునః ప్రారంభించి సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని అమలు చేశామన్నారు. 90 లక్షల మందికి పైగా ఈ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్‌ను పొందుతూ లబ్ధి పొందు తున్నారు. ఏడు నెలల్లో రూ. 6.33 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చా యన్నారు. తద్వారా 4.10 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని, అది చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు.

నీతి, నిజాయితీలపై మాట్లాడే నైతిక హక్కు అంబటికి లేదు: వద్రాణం హరిబాబు



గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుకు లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నైతిక విలువల్లేని అంబటి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అంబటి జీవితం మొత్తం కూడా వెన్నుపోట్లు, అవినీతితో నిండిపోయాయని విమర్శించారు. మరుగుదొడ్డి శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన నిరుపేదకు, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయంలో కూడా లంచం అడిగిన వ్యక్తి అంబటి రాంబాబు అని ఆరోపించారు. రెండున్నరేళ్లపాటు నీటి పారుదల శాఖ మంత్రిగా వెలగబెట్టిన అంబటికి పోలవరానికి ఎన్ని గేట్లు ఉంటాయో కూడా తెలియవని అన్నారు. గత వైసీపీ పాలనలో అంబటి చేసిన అరాచకాలపై సొంత పార్టీ నేతలే తట్టుకోలేక గగ్గోలు పెట్టారని అన్నారు. మంత్రి పెమ్మసాని గుంటూరుకు ఓవర్ బ్రిడ్జిలు తీసుకొచ్చి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు.

ఉపాధ్యాయ సమస్యలు సత్వరం పరిష్కరించండి

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌యూఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు గురువారం సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ వి జగదీష్ కుమార్ ,జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి, ఫణి దత్తు, వేస్కు షరీఫ్, కే వెంకటరావు, ఎం.రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు

పక్షవాత రోగుల్లో సగం మంది హైబీపీ రోగులే!

● న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం బారిన పడు తున్న రోగుల్లో యాభై శాతం మంది అధిక రక్తపోటు బాధితులేనని, బీపీని అదుపులో ఉంచుకుంటే దాని నుంచి నివారణ పొందవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ (గుంటూరు) ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద గురువారం మేడికొండూరు మండలం పాల డుగులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె ప్రసంగించారు. బీపీని 'సైలెంట్ కిల్లర్' అని అంటారని, దీనిని నియంత్రణలో ఉంచుకొంటే పక్షవాతం, గుండెజబ్బుల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ విజయతో పాటు ఎనస్థటిస్ట్ డాక్టర్ శాఖమూరి అనిల్, యూరా లజిస్ట్ డాక్టర్ శరవన కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫణిరాజు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వివేక్, డెంటిస్ట్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, జనరల్‌సర్జన్ డాక్టర్ సాయివెంకటేష్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజేష్ తదితరులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, ఎకోకార్డియోగ్రామ్ పరీక్షలు జరిపి, రోగులకు ఉచి తంగా మందులు అందజేశారు. శిబిరంలో గ్రామానికి చెందిన 400 మంది ప్రజలు హాజరై ఉచితంగా వైద్యసేవలు పొందారు.

ఉదయశంకర్‌కు సేవారత్న, సేవా భూషణ్ అవార్డులు



అవార్డులు అందుకున్న ముళ్ళపూడి ఉదయశంకర్

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురానికి చెందిన ముళ్ళపూడి ఉదయశంకర్‌కు మదర్ థెరిసా సామాజిక సేవా సంస్థ (విశాఖపట్నం) వారు సేవారత్న, సావిత్రిబాయిపూలే మెమోరియల్ ఆర్గ నైజేషన్‌ల నుంచి సేవాభూషణ్ అవార్డు లభించాయి. బస్టాండ్ వద్దనున్న ఓ హోటల్లో జరిగిన కార్య క్రమంలో ఆయా సంస్థల కార్యవర్గ సభ్యుడు, జ్యోతిష్య బ్రహ్మ డాక్టర్ కట్టా హరి చేతుల మీదుగా ఉదయశంకర్‌కు ఈ అవార్డును అందజేశారు. ముళ్ళపూడి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

సమస్యలు.. సవాళ్లు..

ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుగా పేరుగాంచిన గుంటూరు మిర్చియార్డులో సమస్యలు నిత్య నూతనమే. ప్రభుత్వాలు, పాలక మండళ్లు మారుతున్న ప్రతిసారీ ఏవో కొన్ని చిన్నచిన్న ఉపశమన, ఉద్దీపన చర్యలే మినహా ఏ సమస్యను వ్యవస్థాగతంగా సమూలంగా నిర్మూలించింది లేదు. దీంతో మిర్చియార్డుకి వచ్చిన రైతు తన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకొని బయటికి వెళ్లింది లేదు. అలాగే మిర్చియార్డులో పనిచేస్తున్న వందలాది మంది అసంఘటిత రంగ కార్మికులు వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. రైతుల కష్టం, కార్మికుల శ్రమపై ఆధారపడి సాగుతోన్న కోట్లాది రూపాయల వ్యాపారంలో కమీషన్ వ్యాపారులు, ఎగుమతిదారులే లబ్ధిపొందుతుంటారనేది బహిరంగ రహస్యమే! ఈ పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.





నేడు బాధ్యతలు స్వీకరించనున్న చంద్రిక..

మిర్చియార్డు (వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు) ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక శుక్రవారం మిర్చియార్డు పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించనున్నారని యార్డు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. చంద్రిక మునిసిపల్ పరిపాలన శాఖలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో ఉన్నారు.



- మిర్చియార్డులో జోరుగా జీరో వ్యాపారం..
- రైతుల కష్టాన్ని దోచేస్తున్న 'మచ్చు'
- కొత్త లైసెన్సుల కోసం రాజకీయ ఒత్తిళ్లు
- రైతులను ముంచుతున్న వ్యాపారులు
- సీజన్‌లో యార్డుని ముంచెత్తుతున్న మిర్చి
- తప్పని ట్రాఫిక్ కష్టాలు..
- నేడు నూతన సెక్రటరీ బాధ్యతల స్వీకారం..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి డిప్యూటేషన్‌పై నేడు మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించ నున్న చంద్రిక ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ ఏడాది మిర్చి సీజన్ కొద్ది రోజుల క్రితమే ప్రారంభమైంది. ఇప్పటికే రోజుకు లక్ష మిర్చి టిక్కీల వరకు రాక ప్రారంభమైంది. ఈనామ్ పేరుకు ఆన్‌లైన్ ట్రేడింగ్ అయినప్పటికీ ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతోంది. యార్డులోకి వచ్చే లారీల్లో మిర్చి టిక్కీలకు లాట్ ఐడీలు జనరేట్ చేయడంలోనే జాప్యం జరుగుతోంది. ఒక వాహనంలో వచ్చే టిక్కీలు ఒక దుకాణం వద్ద కాకుండా వేర్వేరు దుకాణాల వద్ద రైతులు దింపుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత రోజుకు రెండు లక్షల టిక్కీలకు పైగా యార్డులో విక్రయానికి వస్తాయి. ఇక పీక్ సీజన్ అయిన మార్చి, ఏప్రిల్‌లో మూడు లక్షల టిక్కీల వరకు కూడా వస్తాయి. ఈ నేపథ్యంలో ఎరైవల్స్, సేల్స్ సాఫీగా జరిగితేనే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. లేకుంటే రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగే పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి. ముఖ్యంగా ఈనామ్‌లో ట్రేడింగ్ అయిన మిర్చి టిక్కీలు వెంటనే కాటాలు అయి సాయంత్రం లోపే బయటకు వెళ్లిపోవాలి. లేకుంటే రాత్రి 8 గంటల నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభమౌతుంది. అప్పుడు యార్డులో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. యార్డులో కమీషన్ దుకాణాల ఎదుట పసుపు, ఎరుపు గీతల విధానం అమలులో ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లో మిర్చి టిక్కీలు ఎర్రరంగు గీత వరకు రాకుండా చూస్తేనే వాహనాల రాకపోకలు సాగుతాయి.

బిడ్డింగ్‌లో కేవలం ఒకరు, ఇద్దరు మా త్రమే వేస్తుంటారు. దీంతో పోటీ అనేది ఉండదు. కమీషన్ వ్యాపారి ఎంత చెబితే అంత ధరకు రైతు ఎగుమతిదారుడికి విక్రయించాల్సిందే. యార్డులో పేరుకు 680 మంది కమీషన్ వ్యాపారస్థులున్నప్పటికీ వారిలో ట్రేడింగ్ జరిపేది 100 నుంచి 200 మంది మాత్రమే. మిగతా వ్యాపారస్థులు నామమాత్రంగానే వ్యాపారం చేస్తుంటారు.

ఉచిత భోజనం సగం మంది రైతులకే ..

మిర్చియార్డుకి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నుంచే కాకుండా ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా రైతులు మిర్చిని తీసుకొస్తుంటారు. ఆయా సందర్భాల్లో మిర్చియార్డులో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి భవనాలు ఉన్నాయి. రైతులు ఆహారానికి ఇబ్బంది పడకూడదని ఏటా సీజన్‌లో ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. అయితే ఈ టోకెన్ల జారీ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయి. రైతులు కంటే ప్రైవేటు వ్యక్తులు ఎక్కువ మందికి టోకెన్లు జారీ చేస్తున్నారన్న విషయం బహిరంగ రహస్యమే. దీని మీద అధికారులు చర్యలు చేపడితే వెంటనే వివిధ యూనియన్ల వారు, వారి అనుచరులను రెచ్చగొట్టి ఆందోళనలు చేయించడం చేస్తుంటాయి. ఇలా అరకొరమంది రైతులకు అల్పాహారం, భోజనం అందుతోంది.

గత ఏడాది మహిళ సెక్యూరిటీ గార్డులు మచ్చుకాయలు తీసుకెళుతున్న వారిని అడ్డుకొంటే యూనియన్ నాయకులు హమాలీలను రెచ్చగొట్టి నానా యాగీ చేసి ఆ సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు తీసేయించాయి.

జోరుగా జీరో వ్యాపారం ..

మిర్చియార్డులో బిల్ టూబిల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కమీషన్ వ్యాపారి వద్ద ఎలాంటి పెట్టుబడి ఉండదు. అతను వేరే ఫరం మీదకు తన వద్దకు వచ్చిన మిర్చి టిక్కీలను మార్పు చేస్తాడు. ఇందుకు రైతు వద్ద 2 శాతం కమీషన్‌కు బదులుగా నాలుగైదు శాతం వసూలు చేస్తారు. దీని వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు.

- మిర్చియార్డులో జీరో వ్యాపారం ఒకటి వేళ్లూను కొని ఉంది. యార్డులోకి ప్రవేశించిన సరుకుని ఈనామ్‌లో ఎంట్రీ కాకుండానే ట్రేడింగ్ జరిపించేసి బయటకు పంపేస్తారు. ఇది సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే అవకాశమే లేదన్నది బహిరంగ రహస్యమే. దీని వలన ఏటా మిర్చియార్డు రూ. కోట్లలో మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయాన్ని కోల్పోతోంది.
- రేట్ కటింగ్ బిజినెస్ కూడా మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి కొడుతోంది. రైతుకు చెల్లించేది ఒక ధర, ఈనామ్‌లో ఎంట్రీ చేసే ధర అంతకంటే తక్కువగా చూపిస్తారు. దీని వలన అటు ఎక్స్‌పోర్టరు, ఇటు కమీషన్ వ్యాపారి మాత్రమే లాభ పడతారు. మార్కెటింగ్ శాఖకు ఒక శాతం ఫీజు రూపంలో ఆదాయం కోల్పోతోంది.
- సీజన్ వచ్చిందంటే కమీషన్, ఎక్స్‌పోర్టు వ్యాపారస్థుల గుమాస్తాలకు పండగే. రైతులు తీసుకొచ్చే మిర్చి టిక్కీల నుంచి మచ్చుకాయలు(శాంపిల్స్) తీస్తారు. ఆ కాయలను తిరిగి రైతుల మిర్చి టిక్కీల్లో పోయరు. బయటకు తీసుకెళ్లి ఎంచక్కా అమ్ముకొంటారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో గుమాస్తా రూ. లక్షల్లోనే వెనకేసుకొంటాడని నానుడి.

యథేచ్ఛగా వ్యాపారుల అక్రమాలు..

ఇటీవలకాలంలో అటు కమీషన్, ఇటు ఎగుమతిదారులు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు అనేక అక్రమాలకు పాల్పడిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. రైతులు వద్ద సరుకు తీసుకోవడం రూ. కోట్లలో ఐపీ పెట్టిన సంఘటనలపై కేసులు కూడా నమోదయ్యాయి. అలానే రైతులకు తెలియకుండా కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు మాయం చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా ఘటనల్లో బాధిత రైతులు కేసులు పెట్టడం మినహా వారికి న్యాయం జరిగింది లేదు.



సాగు.. తారుమారు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ప్రభావం చూపాయి. పైగా పంటకు మార్కెట్‌లో ధర లభించలేదు. ధర పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగుకు వేలాది మంది రైతులు దూరమయ్యారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 1,71,226 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 1,15,422 ఎకరాలకు మిరప సాగు పరిమితమైనట్లు ఉద్యాన శాఖ గణాంకాలు చెబుతున్నాయి. క్రితం సారి కన్నా దాదాపు 55,804 ఎకరాల్లో మిరప సాగు తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పాటు నల్ల తామరతో దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతులు ఈ సారి మిరప సాగుకు దూరమయ్యారు. మార్కెట్‌లో మిరప క్వింటాల్ రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉందని రైతులు చెబుతున్నారు. క్రితం సంవత్సరం కన్నా క్వింటాకు రూ.6 వేల వరకు ధర తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మిరపకు ధర కల్పించాలని సీఎం చంద్రబాబును రైతుల పక్షాన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో ప్రభుత్వం సాయం అందిస్తుందని మిరప రైతులు ఆశపడుతున్నారు. ప్రభుత్వం మిరప రైతుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న.. పొగాకు సాగు

మిరప గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలను తారుమారు చేస్తూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడు పొగాకు సాగు పెరిగింది. మిరపతో పాటు శనగ సాగు కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది శనగ సాగు కలిసిరాకపోవడంతో సదరు రైతులు మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- సీఎం కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిని కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ. 3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ. 20 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, గిరిజన తండాలను ప్రత్యేకంగా పరిగణించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



సీఎం చంద్రబాబుకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ వీరాంజనేయులు

టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి రూ.25 లక్షల విరాళం



నారా లోకేశ్ రూ. 25 లక్షల చెక్కును అందజేస్తున్న టీడీపీ నేత మాదాల చైతన్య

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు మాదల చైతన్య రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాదాల చైతన్య మాట్లాడుతూ కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం కష్టపడుతున్న చంద్రబాబుకు, లోకేశ్‌కు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా చైతన్యను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు.



డీఈవోకి విపతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తరగతుల తరలింపు విరమించుకోవాలి

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులు తరలించి కేవలం 1,2 తరగతులు ఉంచి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో సీవీ రేణుక వినతిపత్రం అందజేశారు. అనంతరం కళాధర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫౌండేషన్ స్కూల్ విధానం రాష్ట్రంలో విఫలమైందని, ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం గోవిందు, కె రంగారావు, ఎం కోటి రెడ్డి తదితరుడు పాల్గొన్నారు.

మంగళగిరి చేనేతకు జీవం

(5వ పేజీ తరువాయి)

కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ చేనేతపార్కుతో మంగళగిరిలో మళ్లీ చేనేతకు కొత్తజీవం పోసుకోబోతుందనడంలో సందేహం లేదు. చేనేతపార్కు అంటే..పచ్చి నూలు మొదలు చీర తయారీ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ఇక్కడి నుంచే ఏర్పాటు చేస్తారు. మంగళగిరి వస్త్రాలకు గిరాకీ పెంచే ఉద్దేశ్యతో కంచి చేనేతపార్కు తరహాలో దీనికి సిల్కును కూడా జోడించాలని మంత్రి సవిత సూచించారు.

ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400

మంగళగిరిలో ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400. రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఆరు భారీ షెడ్లను ఏర్పాటుచేసి 146 ఫ్రేమ్ మగ్గాలను నేత కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రత్నాలచెరువులో 520 మగ్గాలు, ఇందిరానగర్, పాతమంగళగిరి కలిపి 350 మగ్గాలు, ఆత్మకూరులో 60, ఎర్రబాలెంలో 225, తాడేపల్లిలో ఎనిమిది, చినకాకానిలో 20, కాజలో ఆరు, నవులూరులో సుమారు వంద వరకు మగ్గాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు కాబోతున్న మెగా చేనేతపార్కులో వేయికిపైగా ఫ్రేమ్ మగ్గాలను ఏర్పాటుచేస్తారని అంచనా వేస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటుతో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సుమారు ఐదారు వేలమందికి ఉపాధి కలగనుంది. ఇక ఈ పార్కులో యారన్ డిపో, అడ్మినిస్ట్రేటివ్, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనాలు, డిస్పెన్సరీ, క్యాంటీన్, కాఫీషాపు, మార్కెటింగ్ కాంప్లెక్స్, వర్క్‌షాపు, వేర్ హౌస్, కాన్ఫరెన్స్‌హాలు, ఆడియో వీడియో సెంటర్, విశ్రాంతి భవనం, వే బ్రిడ్జి, సెక్యూరిటీ భవనం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, ఎక్విప్‌మెంట్ అండ్ ఫర్నిచర్ ఫర్ టెస్టింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సిల్క్ ఈటీపి, కాటన్ ఈటీపీ తదితరాలను ఏర్పాటు చేస్తారు.

టమోరా!





- భారీగా పడిపోయిన ధర
- హోల్‌సేల్‌లో కిలో రూ. 10, రిటైల్‌లో రూ.20
- ఇదే బాటలో క్యాలీఫ్లవర్, వంకాయ, ములక్కాయ
- పెరిగిన దోసకాయ, బెండకాయలు..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఒకప్పుడు అధిక ధరతో దడపుట్టించిన టమోటా ధర ప్రస్తుతం పడిపోయింది. టమోటా ప్రస్తుతం హోల్‌సేల్‌లో కిలో రూ.10లకు విక్రయిస్తుండగా రిటైల్ చిల్లర దుకాణాల్లో రూ. 20లకు విక్రయిస్తున్నారు. టమోటా పంట దిగుబడి గణనీయంగా పెరగటం, స్థానిక టమోటా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు రావటంతో ధరలు ఒక్కసారిగా దిగజారిపోయాయి. రైతుబజారులో టమోటా కిలో రూ. 13కు విక్రయిస్తుండగా పెద్ద మార్కెట్లో కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్ గత నెలలో ఒకటి రూ. 50 లనుంచి రూ. 40 ధర ఉండగా ప్రస్తుతం రూ. 20లకు లభిస్తుంది. ములక్కాయ కూడా గత నెలలో ఒకటి రూ. 30 విక్రయించగా దిగుబడి పెరగటం , స్థానికంగా పంట కూడా మార్కెట్‌కు రావటంతో రూ. 20లకు చేరుకుంది. వంకాయలు కూడా కిలో గత నెలలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దగ్గింది. బంగాళదుంపలు కూడా కిలో రూ. 45 లు గత నెలలో ఉంటే ప్రస్తుతం కిలో రూ. 30లకు తగ్గినట్లు చెబుతున్నారు. ఇక క్యారెట్ కూడా ధరలు తగ్గిన జాబితాలో చేరాయి.



క్యారెట్ కిలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దిగివచ్చింది.

పెరిగిన బెండ, దోస ధరలు..

ఇక కొన్ని రకాల కూరగాయలు ధరలు తగ్గితే మరికొన్ని కూరల ధరలు మండుతున్నాయి. బెండకాయలు గత నెలలో కిలో రూ. 20ల నుంచి రూ. 30లకు విక్రయించగా ప్రస్తుతం అవి కాస్త అమాంతం కిలో రూ. 60లకు చేరుకున్నాయి. పంట దిగుబడి తగ్గటం, స్థానికంగా కూడా పంట ఉత్పత్తి పెద్దగా లేకపోవటంతో మార్కెట్లో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. దోసకాయల ధరల పరిస్థితి కూడా అదే బాటలో ఉంది. దోస గత నెలలో కిలో రూ. 30 ఉంటే ప్రస్తుతం రూ. 60లకు ఎగబాకింది. దాంతో కొనుగోలుదారులు దోసకాయలంటేనే వెనుకాడుతున్నారు. ఇక పచ్చి మిర్చి, కాకర ఇతర కూరగాయాలన్నీ సాధారణ ధరలే కొనసాగుతున్నాయి. టమాటా ధర ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆహారం కోసం కొంగల విన్యాసాలు..

గుంటూరు రూరల్ మండలం లింగాయపాలెం చెరువులో గేదెలపై విన్యాసాలు చేస్తున్న కొంగలివి. గేదెలపై వాలిన క్రిమి కీటకాలను తింటూ ఆకలి తీర్చుకునేందుకు కొంగలు చేస్తున్న విన్యాసాలు చూపరులకు ఆకర్షణీయంగా ఉన్నా గేదెలకు మాత్రం ఇబ్బందికరంగా ఉంటుంది.









దాత వితరణతో పాఠశాల ప్రహరీ నిర్మాణం

దుగ్గిరాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని గణేష్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీని గ్రామానికి చెందిన దాత, విశ్రాంత ఆచార్యుడు బొల్లి లలితానంద ఆర్థిక సహకారంతో నిర్మించనున్నారు. రక్షణగోడ నిర్మాణానికి ఎంఈవో కాజ లక్ష్మీనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో చెదురుమదురుగా జరిగిన చోరీలతో పాఠశాల ప్రహరీ నిర్మించాలని సంకల్పించారు. దీనికి స్వచ్ఛందంగా సాయం అందించేందుకు ముందుకు వచ్చిన లలితానందను ఎంఈవో లక్ష్మీనారాయణ అభినందించారు. డాక్టర్ బొల్లు సుదీప్త్, మహాలక్ష్మి, హెచ్ఎం శ్రీలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.

టీడీపీ సభ్యత్వంతో భద్రత, భరోసా

● ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భద్రత, భరోసా ఉంటాయని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే గుర్తింపు కార్డు అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సభ్యత్వ నమోదుపై నియోజకవర్గంలో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులందరూ కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శాశ్వత సభ్యత్వం తీసుకున్న కల్లూరిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కార్పొరేటర్ స్మితపద్మజ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాడేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పారిశుధ్య సమస్యల పరిష్కార చర్యల్లో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా ఆకస్మికంగా పర్యటించారు. స్థానికంగా ఉన్న రోడ్డు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం పెనుమాక టిడ్కో గృహ సముదాయాలు పరిశీలించి అక్కడ ప్రజల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కుష్ఠు రహిత దేశంగా మార్చాలి

● వైద్యాధికారి యానీ గ్రేస్

ఫిరంగిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మన దేశాన్ని కుష్ఠు వ్యాధి రహిత దేశంగా మార్చాలని వైద్యాధికారి యానీ గ్రేస్ అన్నారు. గురువారం మండలంలోని పొనుగుపాడు గ్రామంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధి అవగాహన ప్రతిజ్ఞను ఏఎన్ఎంలు, ఆశాలతో చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కొండపల్లి సుదర్శనరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం ఏసమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ దుర్గా ప్రసాద్

ప్రత్తిపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు వైద్యాధికారి డాక్టర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు మండలపరిధిలోని ప్రత్తిపాడు, గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్ఠు వ్యాధిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలను తెలియజేస్తూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చర్మం ఉబ్బెత్తుగా రావడం, చెవులపై, వీపుపై నొప్పిలేని బొడిపెలు రావడం, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడతో పాటు ముక్కులో నుంచి రక్తం రావడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించకపోవడం వంటి పలు రకాల సమస్యలు కుష్ఠు వ్యాధికి కారణమన్నారు. అలాగే గొట్టిపాడులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

భూములకు అదనపు ప్యాకేజి ఇవ్వాలి

● జొన్నా శివశంకర్

తాడేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలో గురువారం రైతులు రౌండ్ టేబుల్ సమావేశం బుర్రముక్కు పద్మనాభరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ ఉండవల్లిలో భూ సమీకరణకు ఇవ్వాల్సిన రైతుల భూమి 720 ఎకరాల దాకా ఉందని ఈ భూములు గతంలోనే అత్యధిక రేట్లు పలికిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న ఎకరాకు 1450 గజాల స్థలానికి అదనంగా ప్యాకేజి ఇవ్వాలని, భూసమీకరణకు ఇచ్చిన రైతులకు ఆ గ్రామంలోనే యూ1 జోన్‌కు కేటాయించిన స్థలంలో లేఅవుట్ వేసి ప్లాట్లు ఇవ్వవలసిందిగా డిమాండ్ చేశారు.

208 పశువులకు చికిత్స

తాడికొండ(కంతేరు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంతేరు గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంలో 208 పశువులకు నట్టల నివారణ చికిత్స చేసినట్లు పశుసంవర్థక శాఖ సంచాలకులు డాక్టర్ రాయపరెడ్డి తెలిపారు. ఉచిత ఆరోగ్య శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపరెడ్డి మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరంలో 26 పశువులకు గర్భకోశ, సాధారణ వ్యాధులకు చికిత్సలు చేసినట్లు పేర్కొన్నారు. పశువులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పొన్నెకల్లు పశువైద్యాధికారి డాక్టర్ సౌజన్య, 1962 మొబైల్ వాహనం డాక్టర్ తేజ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పొన్నెకల్లు రోడ్డు

● సంక్రాంతి నాటికి పూర్తికాని ప్యాచ్ వర్కులు
● రెండు కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయం
● తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





గుంతలమయంగా తాడికొండ అడ్డరోడ్డు - పొన్నెకల్లు రోడ్డు

తాడికొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయించి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూస్తానని ప్రకటించింది. సంక్రాంతి నాటికి పాడైపోయిన రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయించాలని పూనుకున్నది. కాని తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి వెళ్లే రోడ్డు మాత్రం అధ్వాన స్థితిలోనే ఉంది. సంక్రాంతి పండుగ వెళ్లిపోయి 15 రోజులు గడుస్తున్నా గుంతలు పూడ్చే పనులు చేపట్టింది లేదు. రెండు కిలోమీటర్లు ఉన్న ఆ రోడ్డులో ప్రయాణించాలంటే నరకప్రాయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. రోడ్డు మార్జిన్స్ పూర్తిగా పాడైపోయాయి. రోడ్డు మార్జిన్స్ కొంత మేరకు గ్రావెల్ తొలించినప్పటికి దానిని సక్రమంగా సరిచేయకుండా వదిలివేశారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణించాలంటే భయం భయంగా నడపాల్సి ఉంది. భారీ వాహనాలు ఎక్కువగా తిరగటం వల్ల ప్యాచ్ వర్కులు చేయించినా ఫలితం ఉండదు. గతంలో డబుల్ రోడ్డు వేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కానీ ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. పొన్నెకల్లు రోడ్డు నుంచి దామరపల్లి, గరికపాడు, రావెల, పాములపాడు, బేజాత్‌పురం, మేడికొండూరు మండలం, పెదకూరపాడు నియోజకవర్గాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. రాజధానికి వెళ్లాలన్నా దీనినే ఉపయోగిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పక్కాగా డబుల్ రోడ్డు వేయాలని, ప్యాచ్ వర్కుల పనులు త్వరగా ప్రారంభించాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

మహాత్ముడి మార్గం.. అనుసరణీయం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింస, శాంతి మార్గాల ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్ముడి మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక విద్యానగర్‌లో క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం బూర్ల మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా స్వర్ణ పంచాయతీ కార్యక్రమం తీసుకువచ్చిందని అన్నారు. మహాత్ముని స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని త్వరలోనే గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చి దిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వందనాదేవి, కూటమి నాయకులు గింజుపల్లి వేంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, కార్పొరేటర్ స్మిత పద్మజ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి మండల టీడీపీ కార్యాలయంలో..

తాడేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండల టీడీపీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధి వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం కుంచనపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కానుగోలు కోటేశ్వరరావు, కంచర్ల రంగారావు, అరవపల్లి శ్రీనివాస్, చిగురుపాటి సుబ్బారావు, కాసరగడ్డ శ్రీనివాసరావు బొర్రా కృష్ణవందన, దాసెట్టి అరుణ, గాదె వినయ్, గుంటిపల్లి లక్ష్మి, కొల్లూరు అరుణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గోర్నేని అనిల్, ఇత్తడి చంటి, కేసంనేని వాసు, ఎద్దు మణికంఠ, వీరంకి సాంబయ్య, రైలుపేటలోని చెక్‌పోస్ట్ వద్ద మహాత్మాగాంధి విగ్రహానికి శివాలయం సెంటర్లోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు, టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, పర్వతనేని హర్ష, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు : మండలపరిధిలోని పెదనందిపాడు, నాగులపాడులో గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. నాగులపాడు లైబ్రరీ వద్ద, పెదనందిపాడు పీఏఎస్ కళాశాలల్లో విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాతూరి శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకులు కాపు వెంకటసుబ్బారావు, గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **కాకుమాను :** తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఇన్‌చార్జి ఆర్ఐ సింగారావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కోస్టల్ ఏరియా బ్యాంకు

● ఎండీ, సీఈవో వేణుగోపాల్‌రెడ్డి



పసుపుయార్డులో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోస్టర్ ఏరియాబ్యాంకు ఎండీ

దుగ్గిరాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో రుణాలందించడంలో కోస్టల్ ఏరియా బ్యాంకు ముందంజలో ఉందని కోస్టల్ ఏరియా బ్యాంకు ఎండీ, సీఈవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సును కోస్టల్ ఏరియాబ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇదివరలో రాష్ట్రానికి సంబంధించి ఆంధ్రాబ్యాంకు ఉండేది, హైద్రాబాద్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైద్రాబాద్ ఉండేది ప్రస్తుతం ఉన్న తెలుగువారి బ్యాంకు కోస్టల్ ఏరియా బ్యాంకు మాత్రమేనని అన్నారు. ఐదేళ్ల కాలంలో వేర్‌హౌసింగ్ రుణాలు రూ.27కోట్లు అందించినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ జి.శరత్ మాట్లాడుతూ నాబార్డ్ అధికార వెబ్‌సైట్‌లో ఎన్ఎల్ఎం పథకంలో గొర్రెలు, మేకలు, పెంపకానికి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించిన అల్లంశెట్టి శ్రీనాథ్, పడుచూరి శ్రీనివాస్, తోడేటి జాన్సన్ తదితరులను సత్కరించారు. సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ జీఎం డీ చంద్రశేఖర్, ఏపీఎన్ ఈఆర్ఎల్ ఆర్ఎం అరుణ్ కుమార్ దర్గా, జిల్లా ఆర్ఎం అరుణ్‌కుమార్, తెనాలి బ్రాంచి మేనేజర్ సీహెచ్ నాగరాజు, మార్కెటింగ్ డీడీ ఎన్ శ్రీనివాసరావు, అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పెదనందిపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల నియమావళిని పాటించాలని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు రాజకీయ నాయకులు అధికారులకు సహకరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు, సత్వరమే ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడరాదని సూచించారు. అనంతరం జడ్పీ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో లక్ష్మీదేవితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, ఐటీడీపీ నాయకుడు నిమ్మగడ్డ గోపీ. జనసేన అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, సీపీఎం. సీపీఐ జిల్లా నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, రమేష్, డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, ఆర్ఐ సాహితీమోహన్ పాల్గొన్నారు.

అమల్లోకి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

తాడికొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించటంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గురువారం తాడికొండలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు, అధికారపార్టీకి చెందిన బ్యానర్లు తొలగించటాన్ని అధికారులు ప్రారంభించారు. తాడికొండలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలు, వైఎస్ రాజశేఖర్ విగ్రహాలకు ముసుగులు వేశారు. అంతేకాకుండా ఆయా పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కోడ్‌ను అతిక్రమించరాదని ప్రకటించారు. ఏవరైన ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

● రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు



జాతా ర్యాలీని ప్రారంభిస్తున్న చిగురుపాటి బాబూరావు

తాడేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి 3వరకు నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర 27వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ రాజధాని నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి నినాదం పేరుతో ఏర్పాటు చేసిన రాష్ట్ర జాతా ర్యాలీని తాడేపల్లిలో గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ప్రారంభించారు. ఈ జాతా 1వ తేదీకి నెల్లూరుకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి టెండర్లు పిలవడం సంతోషకరమని అప్పుల రాజధాని మనకొద్దు... ప్రజా రాజధాని కావాలని పిలుపునిచ్చారు. మళ్లీ అమరావతి నిర్మాణం అనిశ్చితిలో పడకుండా ఉండాలంటే పకడ్బందీ చట్టం తీసుకురావాలని చెప్పారు. రాజధానికి నిధులు పొందడం ప్రజల హక్కు అన్నారు. విభజన హామీ చట్ట ప్రకారమే రాజధానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా నిధులు ఇవ్వడం లేదని ఇప్పుడేమో ప్రపంచ బ్యాంకు అప్పు అంటున్నారని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరిలో జరగబోయే బడ్జెట్‌లో అయినా రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ ప్రచార యాత్ర అని, అనేక సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాశం రామారావు, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎం రవి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, శ్రీనివాసకు మారి, శౌరి, బక్కిరెడ్డి, విజయ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజోపయోగ రాజధాని నిర్మించాలి

తుళ్లూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) అప్పుల రాజధాని కాదని ప్రజోపయోగ రాజధాని నిర్మాణం జరగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబురావు డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన జాత గురువారం రాజధాని గ్రామల్లో పర్యటించింది. మందడం వెలగపూడి, మల్కాపురం, రాయపూడి, తుళ్లూరు చేరుకుంది. కార్యక్రమానికి స్థానిక సీపీఎం నాయకులు కనక తప్పెట్లతో స్వాగతం పలికారు. స్థానిక లైబ్రరీ సెంటర్ వద్ద సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అధ్యక్షతన జరిగిన సభలో నెల్లూరులో జరిగే మహాసభల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు, ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు చంగయ్య, వీసం జవహర్‌లాల్, పేరం బాబురావు, కంభ ఆంజనేయులు, జానీ, గైరబోయిన నాగేశ్వరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవికి ఆర్‌సీఎం చర్చి సంఘస్తుల సన్మానం




ఉండవల్లి శ్రీదేవిని సత్కరిస్తున్న ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు

తాడేపల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని ఉండవల్లి ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు, సంఘ పెద్దలు యూత్ సభ్యులు గురువారం కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించారు. చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరీ మాత మహోత్సవాలు ప్రార్థన, ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని కోరినట్టు తెలిపారు. ఆహ్వానించిన వారిలో చర్చి సభ్యులు రవికుమార్, కిరణ్‌కుమార్, ఎస్సీ సెల్ నాయకులు నాగభూషణం, అరవింద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలి


● టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి



సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ సభ్యురాలు జానకీదేవి, ఆప్కో చైర్మన్ డాక్టర్ హేమలత

పొన్నూరుటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు శ్రీఅభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన నామ సంకీర్తన మహోత్సవంలో ముఖ్య అతిథిగా టీటీడీ సభ్యురాలు జానకీదేవి, ఆప్కో చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్త బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథ కల్యాణోత్సవం



దుగ్గిరాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల రైలుపేటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాధ కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మాఘ పాడ్యమిని పురస్కరించుకుని మధ్యాహ్నం 1.30 వరకూ అత్యంత వైభవంగా జరిగిన శ్రీగోదారంగనాధ కల్యాణోత్సవంలో 35 జంటలు పాల్గొన్నారు. ఆలయం ప్రాంగణమంతా పలు రకాల పుష్పాల తో, అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. అర్చకులు సాకేత్, రామచంద్రల నేతృత్వంలో కన్నుల పండువగా జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్న సమర్పణ జరిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన కల్యాణోత్సవంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం స్వామి ఊయలసేవను నిర్వహించారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

● కేంద్రసహాయ మంత్రి పెమ్మసానికి గ్రామస్థుల వినతి



మంత్రి పెమ్మసానికి సమస్యలు వివరిస్తున్న నాగులపాడు గ్రామస్థులు

పెదనందిపాడు, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు గురువారం గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రిపెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, చెరువులో నీరు రంగు మారి దుర్వాసన వస్తోందని, దీని వల్ల గ్రామస్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారని, గ్రామంలో రెండు చెరువులు ఉన్నాయని, అవి కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి పెదనందిపాడు నుంచి నాగులపాడు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని, వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే గ్రామానికి నిధులు కేటాయించి చెరువులు, రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు పాటిబండ్ల నాగేశ్వరరావు, కలవకూరి వెంకట్రావు, పాటిబండ్ల మురళి, ఆళ్ల నాగేశ్వరరావు, కాపు వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పనులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రధానమైన, అత్యవసరమైన అభివృద్ధి పనులను కొనసాగించాలని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎలాంటి చర్చ, ఎజెండా లేకుండానే సమావేశాన్ని ముగించారు. జబీన్ మాట్లాడుతూ కోడ్ అమల్లోకి వచ్చినందున కొత్తగా ఎలాంటి అంశాలపై చర్చ జరిపే అవకాశం లేదన్నారు. గతంలో కేటాయించిన పనులు యధావిధిగా కొనసాగించవచ్చునన్నారు. మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా ఆమోదయోగ్యమైన రాజధానిని నిర్మించాలి



తాడికొండ చేరుకున్న రాజధాని నిర్మాణం.. రాష్ట్రాభివృద్ధి జాతా ప్రచార వాహనం

తాడికొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ఆమోదయోగ్యమైన రాజధానిని నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా, అమరావతి రాజధానికి చట్టబద్ధత, విభజన హామీలు అమలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరతూ చేపట్టిన రాజధాని నిర్మాణం.. రాష్ట్రాభివృద్ధి జాతా ప్రచార వాహనం గురువారం తాడికొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీల చట్టంలో రాజధాని నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తుందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.50 వేల కోట్లు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా రూ.1500 కోట్లు ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో రాజధానిపై ఎలాంటి సందిగ్ధతకు అవకాశం లేని విధంగా రాజధానికి చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ, మాజీ కార్యదర్శి పాశం రామారావు, రైతు సంఘం నాయ కులు కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, చింతల బాస్కరరావు, బాణావత్ భద్రయ్య షేక్ సుభాని, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప్పుటూరి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ




హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చిన రాములు

వట్టిచెరుకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో గురువారం రాత్రి వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు వారి సిబ్బంది నిర్వహించిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన, హెల్మెట్ల ఆవశ్యకతను వివరిస్తూ హెల్మెట్లతోనే శ్రీరామరక్ష అని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఉప్పుటూరి చినరాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ ఉప్పుటూరి చిన రాములు సొంత నిధులతో 25 హెల్మెట్లను సీఐ రమానాయక్ సమక్షంలో వాహనదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటుపల్లి సదాశివరావు, మిలటరీ మస్తాన్‌వలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పక్షవాత రోగుల్లో సగం మంది హైబీపీ రోగులే

● న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ

మేడికొండూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం బారిన పడుతున్న రోగుల్లో యాభై శాతం మంది అధిక రక్తపోటు బాధితులేనని, బీపీని అదుపులో ఉంచుకొంటే పక్షవాతం నుంచి నివారణ పొందవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (గుంటూరు) ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద గురువారం మేడికొండూరు మండలం పాలడుగులో ఉచిత వైద్యశిబిరంలో ఆమె ప్రసంగించారు. బీపీని సైలెంట్ కిల్లర్ అంటారని, దీనిని నియంత్రణలోఉంచుకొంటే పక్షవాతం, గుండెజబ్బుల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయతో పాటు ఎనస్తటిస్ట్ డాక్టర్ శాఖమూరి అనీల్, యూరాలజిస్ట్ డాక్టర్ శరవన కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫణిరాజు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వివేక్, డెంటిస్ట్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, జనరల్‌సర్జన్ డాక్టర్ సాయివెంకటేష్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అయ్యప్ప శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజేష్ తదితరులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, ఎకోకార్డియోగ్రామ్ పరీక్షలు జరిపి, రోగులకు మందులు అందజేశారు. శిబిరంలో గ్రామానికి చెందిన 400 మంది ప్రజలు హాజరై వైద్యసేవలు పొందారు.

భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రావతి సహిత భావనారుషిస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. షరాఫ్ బజారులోని ఆలయంలో స్వామివారిని పెండ్లి కుమారుని చేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 17వరకు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి రోజూ వాహనసేవలు వైభవంగా జరుపుతారు. మూడోతేదీ తెల్లవారుజామున మార్కెట్ సెంటర్‌లో స్వామివారికి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. జె.సత్యనారాయణ, కోటేశ్వరరావు, వరప్రసాద్, ట్రస్ట్ ఛైర్మన్ రామలింగేశ్వరరావు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు హరిగోపాల్, మదనమోహనరావు తదితరులు పర్యవేక్షించారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలి మారీసుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. ఉదయం 11 గంటలకు పురపాలక కౌన్సిల్ హాల్లో ప్రారంభమయ్యే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొనాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో సదరం సర్టిఫికేట్లు రీ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం దాదాపుగా 120 మందివరకూ హాజరై పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యశాల వర్గాలు పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

పొన్నూరు టౌన్, జనవరి 30: తెలుగు దేశం పార్టీ సీనియర్ కార్యకర్త, వడ్డిముక్కల మాజీ సర్పంచ్ తలకొండపాటి చిన్న సుబ్బారావు కుటుంబానికి గురువారం టీడీపీ నాయకులు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సహకారంతో రూ.10వేల ఆర్థిక సాయాన్ని సుబ్బారావు కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, చలంశెట్టి సీతారామయ్య, రవి, మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరితంగా కూటమి ప్రభుత్వ పాలన

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ఓట్లు వేయించుని అధికారం చేపట్టిన తరువాత దాని ఊసే లేకుండా మోసపూరితంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విమర్శించారు. గురువారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదంటూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏదైతే హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారో వాటిని నెరవేర్చుకుంటూ సంక్షేమ పాలన చేశారన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్‌ను మాత్రమే చెప్పినవిధంగా అందించి మిగిలిన వాటి ఊసే లేదని ఆరోపించారు. నిరుద్యోగులకు భృతి, 18ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు 15 వేలు, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కఠారి హరీష్, బాబు, అక్కిదాసు కిరణ్‌కుమార్, సునీల్, బూరెల దుర్గప్రసాద్, పలువురు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

'అణగారిన వర్గాలు రాజ్యాధికారం సాధించాలి'

పొన్నూరు టౌన్, జనవరి 30: రాష్ట్రంలో అణగారిన వర్గాలు రాజ్యాధికారం సాధించాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్ అన్నారు. గురువారం కేఎంఏ సుభాన్ పొన్నూరు పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో సమావేశమైన సుభాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయం రెండు పార్టీలు, రెండు కులాలకు పరిమితమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమై రాజ్యాధికారం సాధించే దిశగా ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో అడ్వకేట్ అయూబ్ మహ్మద్ ఖాశీం, ఏ జోసెఫ్, షేక్ బాషా, సయ్యద్ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు మహాసభలపై సీపీఎం ప్రచారం

తెనాలి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1 నుంచి నెల్లూరులో జరగనున్న 27వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కె.బాబుప్రసాద్ కోరారు. సుల్తానాబాద్‌లో గురువారం మహాసభల కరపత్రాలు పంపిణీ ప్రచారం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే సభల్లో రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నాయని, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మహాసభల్లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, రాంబాబు, ఏడుకొండలు, శివారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతో ప్రభుత్వ సేవలు అభినందనీయం: ప్రొఫెసర్ మోసిగంటి

పొన్నూరు టౌన్, జనవరి 30: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు సాంకేతికతతో ప్రభుత్వ సేవలు అందించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి గురువారం అన్నారు. వలంటీర్ వ్యవస్థ కంటే తక్కువ ఖర్చుతోను సులువుగా సమర్థవంతంగా రాష్ట్ర ప్రజలకు సేవలు అందుతాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో లోకేశ్ ఆలోచన, ప్రతిభతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారనడానికి నిదర్శనమన్నారు. అగ్రరాజ్యాలలో మాత్రమే వినియోగించే సాంకేతిక సేవలను ఆంధ్రరాష్ట్రంలో వినియోగించటం ఆనందంగా ఉందన్నారు. ఈసేవలు అందరూ సులువుగా పొందవచ్చని జోసెఫ్ మోసిగంటి అన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గాంధీజీ సిద్ధాంతాలు అనుసరణీయం

ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి



మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహాసభ నాయకులు, విద్యార్థులు

పొన్నూరు టౌన్, జనవరి 30: మహాత్మాగాంధీ ఆచరించిన సత్యం, అహింస, సిద్ధాంతాలు నేటి యువతకు అనుసరణీయమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాద్‌రావు అన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు అవ్వారు వెంకటేశ్వరావు, లింగమల్లు మోహనకృష్ణ, అవ్వారు వెంకట సుబ్బారావు, జీఎంఎస్ గుప్తా, బొలిశెట్టి రోశయ్య గుప్తా, తాటికొండ వెంకట శివరామకృష్ణ, న్యాయవాది గండు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ గుడిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిలీప్, బొందలపాటి శ్రీనివాస్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మార్కెట్ సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు. గాంధీచౌక్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీనివాసరావు మహాత్ముని విగ్రహానికి సంఘ సభ్యులతో కలసి నివాళి అర్పించారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

కార్యక్రమంలో పట్టణ, జిల్లా ఆర్యవైశ్య సంఘ సభ్యులు జీవీపీఏ గుప్తా, తాతా శ్రీను, చీమకుర్తి శ్రీనివాసరావు, రాము, అరుణ్ కుమార్, సుధీర్, దర్శి అనంత్, ఎన్.వెంకటరత్న, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: మార్కెట్ సెంటర్‌లో బీసీ సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మేడిబోయిన గంగా యాదవ్, భీష్మ పాములు, రవి, ప్రవీణ్, రమణ, జశ్వంత్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో వైసీపీ నాయకులు మహాత్ముని దంపతులకు నివాళులర్పించారు. అక్కిదాసు కిరణ్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కాటారి హరీష్, బూరెల దుర్గాప్రసాద్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

● పెదకాకాని: గాంధీజీ జీవితం నేటి యువతకు ఆదర్శం అని పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ తెలిపారు. గురువారం పెదకాకాని మండల పార్టీ కార్యాలయంలో అమర వీరుల సంస్మరణ దినం, మహాత్మా గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల గ్రామ నాయకులు, పాల్గొన్నారు



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి బాధాకరం

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



మృతురాలి తల్లిని ఓదారుస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో భవిష్యత్తున్న యువతి మాలతి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిందన్న వార్త తన మనస్సును కలచివేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం అంగలకుదురు - సంగంజాగర్లమూడి ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మల్లెపాడుకు చెందిన చిలుమూరు మాలతి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి మనోహర్ గురువారం మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె తల్లిని పరామర్శించి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఘటన జరిగిన తీరును వైద్యం అందించిన విధానాన్ని కుటుంబసభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ఆసరగా నిలిచే తన కుమార్తె ఇక లేదన్న నిజాన్ని తాము భరించలేకపోతున్నామని మంత్రి ఎదుట మృతురాలి తల్లి విలపించిన తీరు అందరిని కలచివేసింది. మంత్రి మనోహర్ ఆమెను ఓదార్చి కుటుంబానికి అండగా నిలుస్తామని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ప్రభుత్వం తరుపున అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన యువతికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమ్యకు మెరుగైన వైద్యసేవలందించి త్వరితగతిన కోరుకునేలా వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు రమేష్ వైద్యశాలలో చికిత్సపొందుతున్న రమ్యను వారి కుటుంబ సభ్యులను మంత్రి మనోహర్ పరామర్శించారు. యాక్సిడెంట్ జరిగిన తీరును వైద్యశాలల్లో చికిత్స అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో రమ్యకు తీవ్రగాయాలు కావడం బాధాకరమన్నారు. రమ్య ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని, ఆమె త్వరితగతిన కోలుకోవాలని వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కుటుంబసభ్యులకు ధైర్యంచెప్పి ప్రభుత్వం తరుపున అన్ని విధాల సహాయ సహకరాలు అందిస్తానని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్ళ ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమీక్ష

తెనాలి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): క్వారీ తిరునాళ్ళను అధికారులు సమన్వయంతో జరిపించాలని సబ్ కలెక్టర్ సంజన సింహ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రిని పురస్కరించుకుని వడ్లమూడి వద్ద క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో జరిగే తిరునాళ్ళకు చేయాల్సిన ఏర్పాట్లు సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇక్కడ లక్షకు పైగా భక్తులు దర్శనానికి వస్తుంటారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, గుంటూరు ప్రధాన రహదారిపై ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు కూడా ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆర్టీసీ అధికారులు, భక్తులకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని, పంచాయతీరాజ్, దేవదాయ, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతంలో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



తిరునాళ్ళపై అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్

ఈవో రామకోటేశ్వరరావు, శారదాదేవి, ప్రతి ఏటా జరుగుతున్న ఏర్పాట్లు మాదిరిగానే ఈ ఏడాది కూడా చేయాల్సిన ఏర్పాట్లను సబ్ కలెక్టర్‌కు వివరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ రమేష్‌బాబు తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులను ఆదేశించారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తహసీల్దార్ గోపాలకృష్ణతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా పట్టణంలోని 24 పోలింగ్ స్టేషన్లను పరిశీలించామన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ రమేష్ బాబు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

● కొల్లిపర: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా తగిన వసతులు కల్పించనున్నట్లు తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులపై మండల స్థాయి అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2వేల 579 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు. కొల్లిపర హైస్కూలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు పొందేందుకు, తప్పు, ఒప్పులు సరి చేసుకునేందుకు శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం ఉందన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వారిలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్ఐ కోటేశ్వరరావు, ఆర్ఐ వంశీకృష్ణ ఉన్నారు.



కొల్లిపర హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్వాతంత్ర్య ఫలాలు పేదలకు అందాలి: నాగరాజన్



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగరాజన్

తెనాలి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఫలాలు పేదలకు అందాలని 77ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో పూర్తిస్థాయిలో కనీస సౌకర్యాలు అందడం లేదని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఫౌండర్ ఆర్ఆర్ నాగరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న ఆయన గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజన సింహాకు వినతిపత్రం అందజేశారు. సమాజంలో అంతరిస్తున్న మానవత్వాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని, అవినీతిని రూపుమాపాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, 33శాతం రిజర్వేషన్ మహిళలకు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలని కోరుతూ, సత్యాగ్రహ పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు.

మొక్కజొన్నలో చీడపీడల నివారణ చర్యలు

పొన్నూరు టౌన్, జనవరి 30: మొక్కజొన్నలో చీడపీడల నివారణ చర్యలు పాటించాలని లాం ఫాం కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్వీఎస్ గోపాలస్వామి అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో గురువారం శాస్త్రవేత్తలు మొక్కజొన్న పైరును పరిశీలించారు. మొక్కజొన్నలో అధికంగా యూరియాను వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవో డేగల వెంకట్రామయ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి మారీసుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. గురువారం మారీసుపేటలోని శాంతినగర్‌లో పేకాట జరుగుతుందని వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.15300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

కొవిడ్‌తో మృతిచెందిన వైద్యులను స్మరిస్తూ క్యాండిల్‌ర్యాలీ



క్యాండిల్స్ ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

తెనాలి మారీసుపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యసేవలందిస్తూ మృతి చెందిన వైద్యులను స్మరిస్తూ తెనాలి ఐఎంఏ ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు కావూరి అనిల్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన డాక్టర్ బి.లవకుసులు, డాక్టర్ టీడీ రాంబాబు, డాక్టర్ ప్రేంచంద్‌లు కొవిడ్‌లో వైద్యసేవలందిస్తూ కొవిడ్‌తో మృతిచెందారన్నారు. వారి సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. సెక్రటరీ మధు ప్రభాకర్, వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, జాస్తి సుబ్బారావు, వేమూరి శేషగిరిరావు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఆవుల చక్రవర్తి, ఉప్పల పావని ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తెనాలి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం ఉండాలని విశ్రాంత బ్యాంకు మేనేజర్ సాయిలక్కరాజు కోరారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సామాజిక భద్రతలో భాగంగా కళాకారులతో సైబర్ మోసాలపై ప్రజలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెంచుపేట, మార్కెట్ సెంటర్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో కళాకారులు ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ మోసాల తీరును వివరించారు. ఏ ఒక్క అంశాన్ని కూడా సైబర్ నేరగాళ్లు వదిలి పెట్టడం లేదని, మొబైల్ ఫోన్లు వినియోగించడంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురయిన బాధితులు వెంటనే 1930 ఫిర్యాదుచేస్తే తగిన ఫలితం లభిస్తుందని చెప్పారు. ఎస్‌బీఐ అధికారులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొల్లిపర బస్టాండ్‌లో బల్బులు మారుస్తున్న ఆర్‌టీసీ సిబ్బంది, శుభ్రం చేయించిన మరుగుదొడ్లు

కొల్లిపర బస్టాండ్‌లో మౌలిక వసతుల కల్పన

కొల్లిపర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా కొల్లిపర బస్టాండ్ ... నిర్వహణ లేక అంతటా అంధకారం... అంటూ ఆంధ్రజ్యోతి బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. దీర్ఘకాలికంగా అపరిశుభ్రంగా ఉన్న కొల్లిపర బస్టాండ్‌లో సమస్యలకు తగిన పరిష్కారం లభించింది. గురువారం తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ సీఐ ఐజే ప్రసాద్ మండల కేంద్రం కొల్లిపర బస్టాండ్‌ను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన ఆర్‌టీసీ సిబ్బందిని తీసుకువచ్చి బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యాన్ని, విద్యుత్, బాత్‌రూమ్‌లను మరమ్మతులు చేయించి తగిన మౌలిక సదుపాయాలు కల్పించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి పాలనలో రాష్ట్రం ప్రశాంతం

● ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సభలో పాల్గొన్న ఐఎంఏ వైద్యులు

మారీసుపేట (తెనాలి), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని మాజీ మంత్రి, గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన డాక్టర్ల ప్రత్యేక సమావేశంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు దేశ ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న తనకు కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ సీటును ఇచ్చిందన్నారు. తన గెలుపు మన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా గెలుపొంది పెద్దల సభలో మన ప్రాంత సమస్యలపై దృష్టిపెట్టి మంచి జరిగేలా చూస్తానన్నారు. వైద్యులకు గత ప్రభుత్వంలో ఎదురైన అనేక సమస్యలను పరిష్కరించేలా తన వంతు బాధ్యతగా ముందుకు వెళతానని చెప్పారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి సమాజంలో మంచి కోసం పాటుబడే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుందామని తెనాలి ఐఎంఏ శాఖ అధ్యక్షుడు కావూరు అనీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ రాజకీయ నాయకుడిగా నిగర్వీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజల మన్ననలు పొందారన్నారు. అటువంటి వ్యక్తి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. తొలుత ఆలపాటి రాజేంద్రప్రసాద్ కొవిడ్‌తో మృతి చెందిన వైద్యుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యదర్శి మధుప్రభాకర్ ఐఎంఏ శాఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ పరిశీలన




అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, జనవరి 30: పొన్నూరు పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ప్రజలకు పరిశుభ్రమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదేశించారు. గురువారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మిక తనిఖీచేశారు. క్యాంటీన్ పరిసరాలలో శుభ్రత గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భోజనం నాణ్యతపై ఆహారం స్వీకరించే వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన శుచితో కూడిన ఆహారం అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల చిత్రపటాలు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి: ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మున్నంగి, వల్లభాపురం, పిడపర్తిపాలెం, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో పోలీసులు హెల్మెట్‌తో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో అధిక శాతం ద్విచక్రవాహనదారులే ఉంటున్నారన్నారు.



సంకీర్తన కార్యక్రంలో పాల్గొన్న టీటీడీ సభ్యురాలు జానకీదేవి, ఆప్కో ఛైర్మన్ డాక్టర్ హేమలత

భక్తి మార్గాన్ని అనుసరించాలి: జానకీదేవి

పొన్నూరు టౌన్, జనవరి 30: భక్తి మార్గాన్ని అనుసరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన నామ సంకీర్తన మహోత్సవంలో ముఖ్య అతిథిగా టీటీడీ సభ్యురాలు జానకీదేవి, ఆప్కో ఛైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గత 55 సంవత్సరాలుగా అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న నిత్యనామ సంకీర్తన కార్యక్రమం భక్తి మార్గాన్ని అనుసరించేలా ప్రజలను ప్రేరేపిస్తుందని తమ్మిశెట్టి జానకీదేవి కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్త బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.